# పీడ

బహుశా అదే మొదటి సారనుకుంటా! నా దగ్గర ముసుగులున్నాయని నాకు తెలిసింది. ప్లేగ్రౌండ్స్‌లో గంతులు పెడుతూ, హఠాత్తుగా నేను పెద్దదాన్నయి నానని తేలిన రోజు. కళ్ళల్లో నక్షత్రాలు మెరిపిస్తూ కొత్త వోణీ వేసుకొని గొప్పగా ఫీలయిపోతూ క్లాసుకొచ్చిన రోజు. 'జయా నీ అందం ....' అంటూ నా క్లాస్ మేటొ కడు సిగ్గుపడిపోతూ నన్ను పొగిడిన రోజు. నా చదువు, పెళ్ళి, నా శోభనం, పిల్లలు, సంసారం ఇన్ని అనుభవాల్లోనూ నా దగ్గరున్న ముసుగుల ఆజ నాకు తెలియరాలేదు. అవ్వాళ్ళ మొట్టమొదటి సారిగా ఎర్రెర్రని సంధ్యవేళ, జనారణ్యం మధ్యలో నాకు తెలిసిన అనేకానేక మంది మధ్యలోనే, నాకు తెలియని నాలోనే ఉన్న ఓ ముసుగుని అలవోకగా అలా తీసేసి వేసుకున్నా. విభ్రాంతపోయి, తెల్లగా పాలిపోయి కళ్ళనీళ్ళు నేల రాలటానికి సిద్ధంగా వున్న సమయం అది. కానీ ఎంత తొందరగా రియాక్టయినానంటే ఒకే ఒక్క సెకండులో నేను నవ్వేశాను. నన్ను నేను దాచేసుకున్నానన్నమాట. నా ఎదురుగ్గా నిలబడ్డ జంతువు, నా నవ్వుని, నా కళ్ళల్లో వెలుగుని, అలలు అలలుగా నా ముఖం చుట్టూ ముసురుకునేలా నేను నా జుట్టుని కదిపిన వైనాన్ని కళ్ళార్పకుండా అతను చూడడం నాకు తెలుస్తోంది. 'వై నాట్....ఐ కెన్ ఎరేంజ్ యాజ్ యర్లీ యాజ్ పాజిబుల్....' అతను వెంటనే అనేశాడు.

"థాంక్యు సర్....ఉయ్ విల్ మీట్ ఎగైన్...." కళ్ళతోనే వీడ్కోలు పలికి అతను వెనక నుంచి చూస్తూ వున్నాడని తెలిశాక మరింత నాజూగ్గా నడవటం, నేలను జీరాడుతున్న పైటను నడుంచుట్టూ లాక్కోవడం, వంగి ఆటోలో కూర్చోబోతూ అతనివైపు కళ్ళెత్తి చూడడం ఏదీ మరచిపోలేదు. అంతా అలవాటైపోయినట్లుంది. ఆటో, ఆ ఆఫీసు గేట్ దాటి రోడ్డెక్కాక నా ముసుగు జారి లోపల ఎక్కడో భద్రంగా దాక్కుంది. చెలియలికట్ట దాటి దూకటానికి సిద్ధంగా ఉన్న కన్నీటి సముద్రం అప్పుడు నేను అందుకూ సమయం లేదు. ఇంకో రెండు సందులవతలే రీజినల్ ఆఫీసుంది. నా ముందే ఫోన్ తీసుకున్నా డతను

"మిసెస్ జయ వస్తారు. శంకర్ వ్యవహారం సెటిల్ చేయండి" అని చెప్పేశాడు. శంకర్ అక్కడ నా కోసం ఎదురు చూస్తుంటాడు. వన్‌టౌన్‌లో అతని షాప్‌కు రెండు నెలలుగా సరుకు డెలివరీ లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే అతను ఊరు విడిచి పరుగెత్తాల్సిందే. షాపు ఓపెన్ చేసినప్పుడు....ఇంప్రూవ్ చేసే ప్రోసెస్‌లోనూ

అన్నింటికీ ఈ జయ అందుబాటులో ఉండాల్సిందే. నా ఆఫీసర్ హోదా, నా తెలివి,నా గ్లామర్ అన్నీ అతని వ్యాపారపు పెట్టుబడే...." రీజినల్ మేనేజర్‌ని ఇం(పెస్ చేస్తే మనకి స్టాక్ (ప్రమోట్ చేస్తారు జయా. అతనికి సాహిత్యం పిచ్చి. నీ కొత్త పుస్తకం (పెజంట్ చేసి ఈ విషయం కదుపు...."

పది రోజులుగా శంకర్ నన్ను విసిగించని క్షణం లేదు. అతన్ని భోజనానికి పిలవటం, సాహిత్య గోష్ఠి, ఒకటేమిటి శంకర్ పకడ్బందీగా అన్నీ అరేంజ్ చేశాడు. లలిత లలితంగా, మనోహరంగా నా మహానటి ముసుగులో నేను. "మిసెస్ జయా! మీరు చాలా యాక్టివ్. మీ కొత్త కవితా సంకలనం సింప్లీ మార్వలెస్, జీవితం మీద మీకున్న కాంక్ష ఎంత గొప్పగా చూపించారు. ఒక ఉదయాన్ని, ఒక తియ్యని అనుభవాన్ని, ఒక ఆవేదనను, మీరు మాటల్లోకి అనువదించడం ఎంత బావుందనీ, వచ్చే నెలలో నా బెంగుళూరు టూర్ వుంది. వై డోంట్ యూ జాయిన్ విత్ మి, రొటీన్ నుంచి కాస్తంత రిలాక్స్. మీ కొత్త కవితలు,కబుర్లు వినాలి నేను."

ఆ జంతువు గొంతు స్టీరియో (ట్రాక్‌లో వినబడుతోంది మెదడులో. నేనడిగిన డబ్బు శాంక్షన్ కావటం ముఖ్యం. ఇద్దరు పిల్లల తల్లిని.... ఇద్దరు పిల్లలతో ఆఖరి నిముషం దాకా చాకిరిచేసి పది గంటలకు సరిగ్గా సీట్లో కూర్చునేందుకు సర్కస్ ఫీట్లు చేసే నేను.... నీ ప్లజర్ (టిప్‌కి అటెండవ్వాలా....ఎదుటి మనిషికి నువ్విచ్చే గౌరవం ఇదేనా అని నేనతన్ని కడిగానా? నెవ్వర్....కనీసం దిగులుగానైనా అడగ లేదు. నవ్వాను. నా పల్చని పొట్ట, సన్నని నడుము చక్కగా (ప్రదర్శించాను.

'ముఖం మరీ ముడుచుకోకు' అని శంకర్ ముందే హెచ్చరించాడు.

ఆటో ఆగగానే శంకర్ ఎదురొచ్చాడు. అతని ముఖంవైపు కూడా చూడకుండానే బాగ్‌లో ఛేంజ్‌కోసం వెతుకుతూ

'ఎకౌంట్స్ రెండు నెలల్లో క్లియర్ చేయమన్నాడన్నాను' శంకర్ ముఖం వెలిగింది. 'అమ్మయ్య థ్యాంక్యూ జయా' అన్నాడు. లెక్కలు, ఎకౌంట్లు, గుణింతాల మధ్య జీవితం ఎక్కడో పోగొట్టుకున్నామని కూడా గమనించని వివశత్వం.... ఆ.... అంతగా....మేం మాట్లాడుకొనే మాటలు మటుకు ఏమున్నాయి కనుక. మహా అయితే జయా రేపు శాలరీ తీసుకోగానే చిట్స్ క్లియర్ చెయ్యి....లేదా ఎల్.ఐ.సి.... నోటీసు చూసుకున్నావా....హౌసింగ్‌లోన్ విషయం సెటిలయ్యిందా.... ఇలాంటివే కదా. పనులన్నీ అయ్యాక పిల్లలు పడుకున్నాక నైటీ వేసుకుని జుట్టు చక్కగా దువ్వుకొని ఆ అపరాత్రి వేళ కూడా కాస్తంత షోకు చేసుకుని బెడ్‌రూమ్‌లోకి అడుగుపెట్టే వేళకు శంకర్ ఎవరితోనో ఫోన్‌లో చర్చలోనో, కంప్యూటర్‌లో

ఎకౌంట్స్ చెక్ చేస్తూనో, నోరు తెరిచి గురకపెడుతూ నిద్రపోతూనో.... ఇంత ఓపిగ్గా వుంటే ఓసారి ఇలారా జయా అని పిలిస్తే ఓ ఐదు నిముషాల శరీర ప్రణయంతోనో ముగింపు పలికాక....అప్పుడు నేను తీరుబాటుగా నాకు దొరుకుతా. నన్ను నేను భరించలేని, ఆ క్షణాల గురించీ బాధలేదు నాకు. వెంటనే ఓ అందమైన ముసుగు అలవోకగా నా చేతుల్లోకి వస్తుంది వెంటనే మొహంలోకి, చేతుల్లోకి ఓ ఉద్రేకం వచ్చేస్తుంది. అది మెల్లమెల్లగా శరీరం అంతా పరుచుకుంటుంటే నేనే సృష్టించిన నాదైన ఓ కొత్త లోకం చకచకా సినిమా సెట్టింగులా నా చుట్టూరా తయారయిపోతుంది.

ఆకలితో అల్లాడిపోతూ, అస్థి పంజరాల్లా మిగిలిన సోమాలియా పసిబిడ్డలు, కుటుంబం తిరస్కరించిన ఓ వృద్ధురాలు, సామూహిక అత్యాచారానికి గురైన అభాగిని, వీళ్ళంతా నాచుట్టూ. నాకు ఊపిరి సలపని ఉద్రేకం. ఇక అక్షరాల గమ్మత్తులు మొదలై తూకం వేసిన అక్షరాలతో కన్నీటి వర్షాన్ని కురిపిస్తాను. గాయపడిన హృదయాన్ని ఆవిష్కరిస్తాను లేదా చంద్రోదయాన్ని, సంధ్యా గమనాన్ని కాగితపు కాన్వాస్‌పైన సృష్టిస్తా. కళ్ళలో ఏనాడూ చూసి ఎరగని భూకంపాలో ఆర్తనాదాలో, ఆవేదనలలో ఏదో ఒకటి నా కవితా వస్తువు. ఏ అర్ధరాత్రికో ఆ సున్నితపు ముసుగును చేజార్చి, నా నిజం ముఖం నే చూసుకునేందుకు కూడా ఇష్టపడని నా సొంత ముఖంతో నేపక్క మీద వొరిగే వేళకు అలసిపోయి, నా అవమానాలు, కోరికలు, బాధలు, ఆలోచించుకునేందుకు ఒక్క కన్నీటి చుక్క రాల్చేందుకు అవకాశం ఇవ్వకుండా సుషుప్తిలోకి జారిపోయి.... నన్ను నేను మర్చిపోయి.... రోజులు నడుస్తున్నాయో, పరుగెత్తుతున్నాయో.... అర్థం కానంతగా.... ఆ తరువాత నేను మాట్లాడుతున్నా, నడుస్తున్నా, ఆఫీస్ వర్క్ చేస్తున్నా....ఒక కొత్త అనుభవం....నేను ఖాళీగా, బోలుగా, సరిగ్గా చెప్పాలంటే ఒక మూతపెట్టిన సీసా లాగా....అవును సరిగ్గా అదే....లోపల నేనెక్కడా లేను. శరీరం, రక్తం పనిచేసే అవయవాలు కట్టుకున్న చీర ఇదంతా నాదే. కానీ ఇందులో నేనెక్కడా లేను. ఇది పూర్తిగా నాదనే ఆలోచన....బతుకులో ఏ మూల నుంచయినా తొంగి చూస్తుందా అని వెతుకులాట. ఉదయాన్నే నేను లేవగానే కిటికీలోంచి కనబడే తోట నేను వేయించిందే. పొడవాటి కొమ్మలలో ఊగేపూలు నాకు దగ్గరగా కనిపించాలనే ప్లాన్, ఎక్కడికక్కడ వీలుగా అమరిగ్గా ఉన్న ఇల్లు. ఇదంతా నా సంపాదనకు సంబంధించిందే. జీవితంలో నిద్రపోగా, ఆఫీస్ వర్క్‌కు కేటాయించగా మిగిలిన

చాలా భాగం ప్లానింగ్, పొదుపు, తీసివేతలకి....చివరకు బిడ్డలను కనటం, కలవులు పెట్టటం, పెంపకంకోసం అమ్మనో. అత్తనో, కేటాయించటం వరకు పర్ఫెక్ట్ ప్లానింగ్.

జమాఖర్చుల పట్టిక ఈ జీవితం. శంకర్‌కు ఈ విషయంలో చాలా ఖచ్చిత మైన అవగాహన. ప్రాజెక్టు వర్క్‌లాగానో, ఎకౌంట్సు క్లియర్ చేసినట్టు ఇల్లు మెయిన్‌టెయిన్ చేస్తాడు. గట్టి పునాదితో ఇటుక, ఇటుకగా పేర్చికూర్చిన అందమైన కట్టడం వరకూ అయితే జీవితం బాగా ఉన్నట్టే!.... కానీ బతుకు ఎక్కడో గాడి తప్పిన వ్యవహారం. ఏది....ఎలా ఎప్పుడు పోగొట్టుకున్నామో తెలియదు కానీ ఇప్పుడుమటుకు నేను శంకర్ అపరిచితులం. రొటీన్‌గా జరిగే పనులెప్పుడూ మామూలే. వెండిదారప్పోగులాంటి ఓ సున్నితమైన బంధం కేవలం మా ఇద్దరికే సంబంధించి ఏదో పుటుక్కున తెగిపోయిన చిన్న సవ్వడి. కాని అదే ఎప్పుడూ విస్ఫోటనంలా వినబడుతూ ఉంటుంది ఎక్కడో లోలోపల నాకు. జైల్లోపల బందీలను చేసినట్టు ఆ ఇంట్లో మేమిద్దరం. ప్రేమ, స్నేహం వంటి పదాలు జీవితంలోంచి ఏనాడో నడిచి వెళ్ళిపోయి కేవలం శరీర మాత్రంగా మేము మనుషులుగా కనిపిస్తూ నడుస్తూ,ఊపిరి పీలుస్తూ, మాటలు కరువై, ఒకళ్ళ ఉనికి మరొకళ్ళకి దుర్భరమైన ఘడియల్లో ఆలోచనల బరువుతో కుంగుతున్న ఓ రాత్రివేళ మా కొలీగ్ దగ్గర నుంచి ఫోన్ .... ఎన్నెన్నో వందల మైళ్ళ దూరం నుంచి ఓ పిలుపు. ఇద్దరం ప్రొబేషనరీ ఆఫీ సర్స్‌గా పనిచేశాం. అతను ఇంకో బ్రతుకు తెరువు వెతుక్కుంటూ వెళ్ళిపోయిన చాలాకాలం తరవాత.... ప్రవాహంలా కబుర్లు గడిచిపోయిన గతం అంతా నిమిషాల్లా, అతనికి చెప్పాలనే ప్రయత్నం. హఠాత్తుగా అడిగాడతను. 'ఎందుకలా నిరాశగా మాట్లాడుతున్నావు జయా! ఎనీ ప్రాబ్లమ్! 'ఉలిక్కి పడ్డానో క్షణం. ఏమీ బాగాలేను. అసలు నేను నేనుగా లేను. ఇంకెవరిలాగానో ఉన్నానని గబగబా చెప్పాలనిపించింది. అలాంటి నిజాలు చెప్పటం సాధ్యమేనా? గమ్మత్తుగా నేను తెలుసుకోకుండానే వచ్చే స్తోంది నన్ను దాచేసే ఓ ముసుగు. అర్ధరాత్రి వేళ నీ ఫోన్‌తో ఉలిక్కి పడిలేచి నువ్వేసే యక్ష ప్రశ్నలకు ఎ.పి.పి.ఎస్.సి యగ్జామ్‌కి వ్రాసినట్టు టక్ .... టక్‌మని సమాధానాలు చెప్పేస్తుంటే .... నీ ఊహాగానాలు ఏమిటి?'అని సవాల్ విసరగలిగాను. ఎంత హిపోక్రసి .... మనుషులకు మాత్రమే చాతనయిన చాకచక్యం.

'ఇదిగో చూడు నేను హాపీ బీయింగ్‌ని. జీవితంలో బరువులు, భారాలు మనకు పడవు. కష్టాలు టెన్షన్స్ మన వల్ల కావు. 'నీటి తరగల మీద పూల పడవ లాగా వుండాలి బ్రతుకు' నేను నవ్వుతున్నాను. ఎప్పటెప్పటి జ్ఞాపకాలనో వర్ణిస్తు న్నాను. నా ఉద్యోగం .... రచనా వ్యాసంగం....

ఫోన్ పెట్టేస్తుంటే శంకర్ అన్నాడు 'ఇతనికి అసలు మానర్స్ తెలియదనుకుంటానే. అర్ధరాత్రి, అపరాత్రి ఫోన్స్. డిస్టర్బ్ చెయ్యకూడదని తెలియదా? అసలు నిన్ననాలి. అంత పిరగబడి నవ్వులెందుకు. అంత ఎంకరేజ్ చేస్తుంటే వాడేం ఋష్యశృంగుడా? ఈ ఓవర్ యాక్షన్ ఏమిటో నాకేం నచ్చలేదు' ఓ నిమిషం ఆలోచించే వ్యవధి తీసుకున్నాను. ఆ కొంచెం సమయం చాలు. ఓ బానిస ముసుగేదో జారిపోయింది, చాలా కాలం తరువాత నేను నిటారుగా నిలబడ్డాను. కట్టలు తెగిన ఆవేశం, కోపం వెల్లువలో నా వేలాది వేల ముసుగులన్నీ ఎటుకొట్టుకుపోయాయో ఏమో .... ఆ రాత్రి శంకర్‌తో చాలా మాట్లాడాను. నేనెందుకలా అయిపోయానో చెప్పుకొచ్చాను. ఇల్లనే నాలుగు గోడల కోసం నా చుట్టూ నేనే నిర్మించుకున్న భద్రతా వలయం కోసం, సమాజం మెప్పుపొందాలనే నా బలహీనత కోసం నా రూపం మార్చుకున్న విధం వివరించాను. ఒక్క పడక సుఖం ఇవ్వటం మినహాగా, చాలా మంది మగవాళ్ళని నేను ఆనందపెట్టే ఉన్నా .... నా ప్రతి నవ్వు, డబ్బు సంపాదించినంత వరకు శంకర్‌కి అభ్యంతరం లేకపోవటం నాకు చక్కగా అర్థం అయిందని చెప్పాను. ఈ మెట్లన్నీ దిగేవరకు శంకర్ నన్ను పెట్టిన ఇబ్బంది గురించి మాట్లాడాను. కన్న పిల్లల సాక్షిగా హోరాహోరీగా పోట్లాడుకున్న రాత్రులు, తిండీ నిద్రలేకుండా నేను సముద్రాన్నయిన సంఘటనలు, శంకర్ బిజినెస్ టరమ్స్‌లోకి నా ఉద్యోగం, నా ఇన్‌ఫ్లుయన్స్ మెల్లమెల్లగా జొరబడిన ఘడియలు ....వరసాగ్గా ఎన్నెన్నో తలపోతల తరవాత శంకర్ నిశ్చయంగా చెప్పాడు. నా కారెక్టర్ విషయం ఇహ నేను శ్రద్ధ తీసుకోవాలన్నాడు. అనవసరమయిన నవ్వులు, పరిచయాలు, ఫోన్లు తగ్గించుకోవాలన్నాడు. ఇష్టమైతే ఉద్యోగం చెయ్యమని లేకపోతే ఇంట్లో హాయిగా పిల్లలను చూసుకోమని కన్సెషన్ ఇచ్చాడు. నా పి. ఎఫ్‌తో సహా నేను ఊడ్చి ఇచ్చిన డబ్బుతో, నా నవ్వుల పెట్టుబడితో పెట్టిన అతని బిజినెస్ ఇప్పుడు ట్రాక్‌లో పరుగెడుతోంది. ఇహ ....నేనింకో ముసుగు వెతుక్కోవాలి .... రాత్రి నా ఆవేశపు వెల్లువలో కొట్టుకుపోయిన నా పాతివ్రత్యపు ముసుగు ఎక్కడైనా దొరుకుతుందేమో .... ఎంతకని వెతకను? .... ఎన్ని వేల ముసుగులో? .... ఎన్ని రంగుల ముసుగులో? .... తెల్లారే సరికి నాకా ముసుగు దొరకకపోతే కష్టం. నేను నటించబోయే ఆఖరి పాత్రకా మేలి ముసుగు ఎంతో అవసరం. ఎక్కడ పోయిందో ఆ నా పాతివ్రత్యపు ముసుగు? ....

(16.8.96 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)